ఓటరును చేరే దారేది..!



బంజారాహిల్స్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ముసాయిదా విడుదలైంది. 40 రోజుల వ్యవధిలో నామినేషన్‌లు, విత్‌డ్రాలు, ఆశావాహుల బుజ్జగింపులు, ఎన్నికల ప్రచారం ఇలా అన్నింటిని చక్క బెట్టడం పార్టీలకు కత్తి మీద సాము లాంటిదే. ఇవన్నీ ఒక ఎత్తు అయితే ఓటరును ప్రసన్నం చేసుకోవడం అనేది అతి పెద్ద సవాల్. ఎన్నికల ప్రచారం నిర్వహించినప్పటికీ ఓటరులో నమ్మకాన్ని నింపేందుకు తెరవెనుక అనేక ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉంటుంది. ఇందుకోసం అందుబాటులో ఉన్న దారులను సద్వినియోగపర్చుకునేందుకు రాజకీయ పార్టీలు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయి. ఇందుకోసం ఓటర్ల జాబితాను కులాల వారీగా విభజించడంతో పాటు గతంలో జరిగిన పోలింగ్ సరళిపై దృష్టి సారించాయి. గతంలో పార్టీకి ఎక్కడ ప్రతికూలత ఉందో లెక్కలు వేసి వాటిని సరిచేసే బాధ్యతను ఇప్పటికే పార్టీ అధిష్ఠానాలు సీనియర్ల భుజాన పెట్టాయి. దీంతో ఈ జాబితాను సరిచూసేందుకు నాయకులు ప్రత్యేకంగా సిబ్బందిని సమకూర్చుకుంటున్నారు.


తెర వెనుక రాజకీయాలు..

నియోజకవర్గంలో ఇప్పటికే కులాల వారీగా సమీకరణలు మొదలయ్యాయి. కులం సంక్షేమ సమితిలను రాజకీయ నాయకులు కలిసి మద్దతు కోరుతున్నారు. కులాల వారీగా భారీగా ఓట్లను కొల్లగొడితే సంప్రదాయ ఓట్లతో గెలుపు సాధ్యమవుతుందని పార్టీలు అంచనా వేస్తున్నాయి. ఇందుకోసం తెర వెనుక ఒప్పందాలకు సీనియర్లు తెర తీస్తున్నారు. ఇందుకోసం తాయిలాలు, హామీలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఓ పార్టీ నాయకుడు కుల సంఘం పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు ఏకంగా వారి అసోసియేషన్ కోసం స్థలం కేటాయిస్తానని వాగ్దానం చేశాడు. మరో పార్టీ భారీగా ఆర్థిక వనరులు సమకూర్చి పెడతామని హామీ ఇచ్చినట్టు సమాచారం.

అంతేకాదు నియోజకవర్గంలో పెద్ద కాలనీలు, అపార్ట్‌మెంట్‌లలో సంక్షేమ సమితి నాయకులను కలిసి తాయిలాలు ప్రకటిస్తున్నారు. సీసీ కెమెరాలు, క్రీడాసదుపాయాల కోసం హామీలు గుప్పిస్తున్నారు.

గత పోలింగ్ సరళి ఇలా....

నియోజకవర్గాల పునర్విభజన అనంతరం కాంగ్రెస్ ఓ సారి టీడీపీ ఓ సారి, బీఆర్ఎస్ రెండుసార్లు గెలిచాయి. కాగా, ఐదు సంవత్సరాల్లో పార్టీల బలాబలాల్లో తీవ్ర మార్పులు చోటుచేసుకున్నాయి. 2018లో జరిగిన గ్రేటర్ ఎన్నికల్లో నియోజకవర్గంలోని నాలుగు డివిజన్‌లలో బీఆర్ఎస్ విజయం సాధించగా, రెండింట ఎంఐఎం విజయం సాధించింది. ఆ తర్వాత చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇద్దరు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లోకి వెళ్లిపోయారు. 2023లో నియోజకవర్గంలో బీఆర్ఎస్ 43.95 శాతం ఓట్లు సాధించగా, కాంగ్రెస్ 35.03 శాతం, బీజేపీ 14.12 శాతం ఓట్లు సాధించాయి. ఎనిమిది నెలల వ్యవధిలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో గణాంకాలు మారాయి. కాంగ్రెస్ మొదటి స్థానం సాధించగా, బీజేపీ రెండు, బీఆర్ఎస్ మూడో స్థానానికి పడిపోయింది. ఈ పరిణామాలను పరిగణలోకి తీసుకొని విశ్లేషకులు అంచనాలు రూపొందిస్తున్నారు. ఏదేమైనా ప్రజలు చివరలో ఎలాంటి తీర్పు ఇస్తారనేది పోలింగ్ పూర్తయితే గాని తేలదు.



3,98,982 మంది ఓటర్లు

హైదరాబాద్ పరిధిలో అతి పెద్ద నియోజకవర్గంగా జూబ్లీహిల్స్‌కు రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక స్థానం ఉంది. 2023లో 3.90 లక్షల మంది ఓటర్లు ఉండగా గడిచిన యేడాదిన్నరలో ఓటర్లు గణణీయంగా పెరిగారు. ప్రస్తుతం తుది జాబితాలో 3,98,982 మంది ఓటర్లు ఉన్నట్టు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఇందులో పురుషులు 2,07,367 మంది, మహిళలు 1,91,590 మంది, ఇతరులు 25 మంది ఉన్నారు. ఓటర్లు అధికంగా ఉండటంతో ఎన్నికల అధికారులు కూడా పోలింగ్ కేంద్రాల సంఖ్యను పెంచారు. గతంలో 324 పోలింగ్ బూత్‌లు ఉండగా ఇప్పుడు ఆ సంఖ్యను 407కు పెంచారు. ప్రతీ పోలింగ్ బూత్‌లో 800 నుంచి 1200 లోపు ఉండేలా కసరత్తు చేశారు. వర్గాల వారీగా చూస్తే మైనారిటీ ఓటర్లు అధికంగా ఉన్నారు. ఇక్కడ సుమారు 1.15 వేల మంది మైనారిటీ ఓటర్లు ఉన్నట్టు లెక్కలు చెబుతున్నాయి. తర్వాత స్థానం బీసీలదే. సుమారు 1.50 లక్షల మంది ఉన్నట్టు అంచనా. మున్నూరుకాపులు, ముదిరాజ్‌లు, యాదవ, గౌడ, వడ్డెర, రజక వర్గానికి చెందిన వారే అధికంగా ఉన్నారు. ఓసీ ఓటర్లు సుమారు 70 వేలు ఉండగా ఆంధ్ర కాపు, తూర్పుకాపులు, కమ్మ, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు భారీగా ఉన్నారు. ఎస్సీలు సుమారు 30 వేల మంది ఉన్నట్టు సమాచారం.



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్ఓ, సర్కిల్-19 డీఎంసీ రజనీకాంత్‌రెడ్డి

11 వరకు ఓటు నమోదు

వెంగళరావునగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నిక నేపథ్యంలో ఈనెల 11వ తేదీ వరకు ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని జూబ్లీహిల్స్ ఈఆర్ఓ, జీహెచ్ఎంసీ సర్కిల్-19 డీఎంసీ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఎన్నికల అధికారులు, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. తమ పరిధిలోని పోలింగ్ బూత్‌లలో ఏర్పాట్లను పరిశీలించాలని, అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏమైనా లోటుపాట్లు ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలని సూచించారు.

అగ్రవర్ణ పార్టీల భూస్థాపితమే లక్ష్యం

● ఎమ్మెల్సీ చింతపండు నవీన్

పంజాగుట్ట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణ రాజకీయ పార్టీలను భూస్థాపితం చేయడమే తమ లక్ష్యం అని, తమది ఏక వ్యక్తి పార్టీ కాదు, మహిళను పార్టీ అధ్యక్షురాలిగా చేస్తామని తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకుడు, ఎమ్మెల్సీ చింతపండు నవీన్(తీన్మార్ మల్లన్న) అన్నారు. సామాజిక తెలంగాణ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ ప్రొఫెసర్ మురళీ మనోహర్ అధ్యక్షతన బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మెల్సీతో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు వేసిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెబుతూ పార్టీ లక్ష్యాలు, అధికారంలోకి వస్తే చేసే కార్యక్రమాలను ఆయన వివరించారు. ప్రత్యేకంగా బీసీ ఉద్యోగుల సెల్ ఏర్పాటు చేస్తామని, తన నెల జీతం బీసీ ఉద్యోగుల సమాఖ్యకు ఇస్తానని తెలిపారు. సమావేశంలో డి.సమ్మయ్య, కొండల్‌రావు, నగేష్ భూషణ్, జ్వలిత, ప్రొఫెసర్ నరేంద్ర బాబు, తుల్జారామ్ సింగ్, పార్టీ ప్రధాన కార్యదర్శి సంగెం సూర్యారావు, వి.జానయ్య యాదవ్ పాల్గొన్నారు.



ఓవరాల్ చాంపియన్లుగా నిలిచి కప్పులు ప్రదర్శిస్తున్న కేడెట్లు

ఎన్‌సీసీ జాతీయ ట్రెక్కింగ్ శిబిరంలో

ఓవరాల్ చాంపియన్‌గా హైదరాబాద్

ఖైరతాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ జాతీయ ట్రెక్కింగ్ శిబిరం ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా చోడవరంలో జరిగింది. ఇందులో హైదరాబాద్ నుంచి వెళ్లిన 60 మంది బాలికల ఎన్‌సీసీ బృందం ట్రెక్కింగ్‌తో పాటు ఇతర పోటీలలో నెగ్గి ఓవరాల్ చాంపియన్లుగా నిలిచారు. ఈ బృందంతోపాటు హైదరాబాద్ ఎన్‌సీసీ అధికారులుగా వెళ్లిన లెఫ్టినెంట్ డాక్టర్ పల్నాటి నరేష్, హిమబిందును తెలంగాణ 3వ బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ శరత్ బుధవారం అభినందించారు. శిబిరం ముగించుకొని విద్యార్థినులు హైదరాబాద్‌కు చేరుకోగా ఉన్నతాధికారులకు వారు సాధించిన బహుమతులను చూపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో మొత్తం 510 మంది బాలికా కేడెట్లకు కఠినమైన శిక్షణతోపాటు శారీరక, మానసిక శిక్షణ అందిందని ఎన్‌సీసీ అధికారి డాక్టర్ నరేష్ తెలిపారు.



రహ్మత్ నగర్‌లోని గురుద్వారాలో సాహెబ్ శ్రీ గురు రాందాస్ జీ మహారాజ్ 491వ జయంతి వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్



రహ్మత్ నగర్‌లోని గురుద్వారాలో సాహెబ్ శ్రీ గురు రాందాస్ జీ మహారాజ్ 491వ జయంతి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ సీనియర్ నాయకుడు వి.నవీన్ యాదవ్, తదితరులు

గ్రామీణ ట్యాగ్‌ను అభివృద్ధి చేయాలి

● కలెక్టర్ హరిచందన

అమీర్‌పేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): చేతివృత్తుల కళాకారుల ప్రతిభను గుర్తించేందుకు గ్రామీణ ట్యాగ్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. నాబార్డు ఆధ్వర్యంలో అమీర్‌పేట కమ్మ సంఘం హాల్లో గ్రామీణ భారత్ మహోత్సవ్ పేరిట ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళల ప్రదర్శనను బుధవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని కళాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు సరైన వేదికను అందించడంలో నాబార్డు విశేషంగా కృషి చేస్తుందని అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యాభివృద్ధి కోసం నాబార్డు, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ సమన్వయంతో పని చేయాలని సూచించారు. కళాకారులను, వారి చేతివృత్తులను ప్రోత్సహించే దిశగా బ్యాంకర్లు సహకారం అందజేయాలని కోరారు. భారతీయ చేతివృత్తులకు విదేశాల్లో భారీ డిమాండ్ ఉన్న విషయాన్ని గుర్తించాలన్నారు. నాబార్డు సీజీఎం ఉదయ భాస్కర్ మాట్లాడుతూ కళలు, కళాకారులు, వారి ప్రత్యేకతను గుర్తించడంలో నాబార్డు ఎప్పుడూ ముందంజలో ఉంటుందన్నారు. ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ చిన్మోయ్‌కుమర్, ఎస్‌బీఐ సీజీఎం ఎస్.రాధాకృష్ణన్, నిమ్స్ డైరెక్టర్ మాలిని దివాకల తదితరులు ప్రసంగించారు. ప్రదర్శనలో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత, చేతివృత్తుల కళాకారులు తాము తయారు చేసిన అరుదైన ఉత్పత్తులను ప్రదర్శించారు. ప్రదర్శన వారం రోజులపాటు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నాబార్డు జీఎం ఆర్.గణపతి, డిప్యూటీ జనరల్ మేనేజర్ దీప్తి సునీల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన దాసరి

పెంచిన ఆర్టీసీ బస్‌చార్జీలను తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ బి.చంద్రకుమార్

పంజాగుట్ట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పెంచిన ఆర్టీసీ బస్‌చార్జీలను వెంటనే తగ్గించాలని జస్టిస్ బి.చంద్రకుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ స్టేట్ డెమోక్రటిక్ ఫోరం(టీఎస్‌డీఎఫ్) కన్వీనర్ ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వంలో పెరిగిన అవినీతి, మతోన్మాదం వల్ల భవిష్యత్‌కు ప్రమాదం ఉందని ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించాలనే తమ లక్ష్యం కోసం పలు సంస్థలతో కలిసి పనిచేశామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిస్తోందన్నారు. జీతంలో మూడో వంతు పిల్లల చదువు కోసం ఖర్చు చేయాల్సి వస్తోందని, అనారోగ్యానికి గురైతే అప్పులు చేయాల్సి వస్తోందని అన్నారు. బోధన రుసుము, ఉపకార వేతనాలు, విదేశీ విద్య కోసం సాయం విడుదల చేయడం లేదని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గానికో ఇంటిగ్రేటెడ్ స్కూల్ అంటున్నారని, అవి స్థానిక ఎమ్మెల్యేల జేబులు నింపేందుకేనని ఆరోపించారు. ఒకవైపు ఖర్చులు పెరుగుతుంటే మరోవైపు ఆర్టీసీ చార్జీలు పెంచుతూ ప్రజలపై మోయలేని భారం మోపుతున్నారని అన్నారు. చెరువులు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమించే భూ బకాసురులను గుర్తించి, వారి నుంచి భూములను కాపాడాలని అన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఫార్మా కంపెనీలను ఒప్పుకోరని, ఇక్కడ మాత్రం ఫార్మాసిటీ కట్టడానికి ఒప్పందాలు చేసుకుంటున్నారని, దీనివల్ల నగరం చుట్టూ ఉన్న వాతావరణం, భూగర్భజలాలు కలుషితమై రోగాలు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలపై ప్రేమ ఉన్న వారు ఇథనాల్, ఫార్మా కంపెనీలకు భూములు ఇవ్వరని అన్నారు. ఒప్పంద ఉద్యోగులు, పొరుగు సేవల ఉద్యోగులకు 8 నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదన్నారు. 2016లో కేసీఆర్ తెచ్చిన భూసేకరణ చట్టం ప్రకారం రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి అన్నారు. ఉచిత విద్యా, వైద్యం ఉంటే చాలని, మిగతావి అవసరం లేదని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వెంకటేశ్వర రావు అన్నారు. సమావేశంలో వివిధ సంఘాలు, పార్టీల నాయకులు జి.రవి, జానకి రాములు, కృష్ణ, వి.సుధాకర్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చలేక ముఖం చాటేస్తున్న సీఎం

● కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద

బోరబండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖం చాటేస్తున్నారని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్ తరఫున బోరబండ డివిజన్ బాబాసైలానీ నగర్‌లో పార్టీ కార్యకర్తలతో కలిసి బుధవారం రాత్రి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బస్తీలో ఇంటింటికీ తిరిగి 'కాంగ్రెస్ బాకీ కార్డు'లను పంపిణీ చేసిన ఆయన ఎన్నికల ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాగంటి గోపీనాథ్ చేసిన అభివృద్ధి గల్లీగల్లీలో కనిపిస్తోందని తెలిపారు. మాగంటి సతీమణి సునీత అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనేకమందికి మాగంటి డబుల్ బెడ్‌రూమ్ ఇప్పించడమే కాకుండా, బస్తీల్లో మౌలిక వసతులు కల్పించారని ప్రజలు చెబుతుంటే ఆనందంగా ఉందన్నారు. ఎన్నికల్లో తప్పుడు హామీలు ఇచ్చి దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక మంత్రులను ప్రజల వద్దకు పంపుతున్నారని ఆరోపించారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పేందుకు జూబ్లీహిల్స్ ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బోరబండ డివిజన్ అధ్యక్షుడు టి.కృష్ణమోహన్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



బాబాసైలానీ నగర్‌లో ప్రచారం చేస్తున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద

నిరుపేదలకు వైద్య పరీక్షలు అభినందనీయం

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

అమీర్‌పేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యతగా ఖరీదైన వైద్య పరీక్షలను నిరుపేదలకు ఉచితంగా అందుబాటులోకి తెస్తున్న మ్యాగ్నిస్ సేవలు అభినందనీయమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కొవిడ్ కష్టకాలం నుంచి ఇప్పటి వరకు 1200కు పైగా ఉచిత వైద్య పరీక్ష శిబిరాలు నిర్వహించిన మ్యాగ్నిస్ అధినేత, రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ ఇన్‌చార్జి డాక్టర్ సంగం శ్రీనివాస్‌రావును ఆయన అభినందించారు. ఎస్ఆర్‌నగర్‌లోని మ్యాగ్నిస్ సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగిన ఉచిత వైద్య పరీక్ష శిబిరానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ ఆర్థికంగా వెనకబడ్డ వయోధికులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయడం, అనాథలు, మురికివాడల్లో ప్రజలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఖరీదైన వైద్య పరీక్షలను అందుబాటులోకి తెస్తూ మాగ్నిస్ సంస్థ చేస్తున్న కృషిని ప్రశంసించారు. కార్యక్రమంలో వయోధికుల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు కాసాని సహదేవ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే తలసానికి పూల మొక్క అందజేస్తున్న మ్యాగ్నిస్ సంస్థ అధినేత శ్రీనివాసరావు



బనానా క్లబ్ దుకాణాన్ని సీజ్ చేయిస్తున్న ఉప కమిషనర్ సమ్మయ్య

వ్యాపార లైసెన్స్ లేని దుకాణం సీజ్

ఖైరతాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ నుంచి వ్యాపార లైసెన్స్ తీసుకోని దుకాణాలను మూసివేయక తప్పదని సర్కిల్-18 ఉప కమిషనర్ సమ్మయ్య హెచ్చరించారు. బుధవారం ఆయన ఏఎంసీ కైలాష్, అధికారులతో కలిసి స్థానికంగా పర్యటించారు. పలుసార్లు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని ఒత్తిడి చేసినా, నోటీసులిచ్చినా స్పందించకపోవడంతో పంజాగుట్ట నాగార్జున సర్కిల్ ఎంపీఎం స్క్వేర్ మాల్‌లోని బనానా క్లబ్ దుకాణాన్ని సీజ్ చేశారు. ప్రతీ దుకాణదారు విధిగా వ్యాపార లైసెన్స్ తీసుకోవాల్సిందేనని సమ్మయ్య సూచించారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

అమీర్‌పేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట ప్రొహిబిషన్, మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 2025-2027కు గాను మద్యం దుకాణాల నిర్వహణకు లైసెన్స్ పొందడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ పటేల్ బానోత్ తెలిపారు. 21 సంవత్సరాల కంటే ఎక్కువ వయసు కలిగిన వారు రూ.3 లక్షలు (నాన్ రిఫండబుల్) చెల్లించి ఈనెల 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. హైదరాబాద్ జిల్లాకు సంబంధించిన మద్యం దుకాణాల దరఖాస్తులను నాంపల్లిలోని అబ్కారీ భవన్ నాలుగో అంతస్తులో స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు.

భవనం పై నుంచి పడి యువకుడి మృతి

బంజారాహిల్స్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోలి): భవనం పై వెల్డింగ్ పనిచేస్తున్న యువకుడు ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్వాన్, మహబూబ్ కాలనీ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇబ్రహీం స్క్రాప్ వర్కర్. ఈయన పెద్ద కుమారుడు అజ్మత్(19) వారం రోజులుగా అలకాపూర్ టౌన్‌షిప్‌లోని యూనిక్ ఫ్యాబ్రికేషన్ వద్ద వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. అక్టోబరు 7న యజమాని యూనస్‌ఖాన్ సూచన మేరకు మరో ఇద్దరు కార్మికులతో కలిసి బంజారాహిల్స్ రోడ్డునెంబర్.10 జహీరానగర్ అబ్దుల్లాకు చెందిన భవనంలో వెల్డింగ్ పనులకు వెళ్లాడు. రెండో అంతస్తులో వెల్డింగ్ చేస్తుండగా అజ్మత్ కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. సహచరులు వెంటనే అంబులెన్స్ ద్వారా ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. నిర్లక్ష్యం, భద్రతా లోపాల కారణంగా తన కుమారుడు ప్రమాదంలో మరణించాడని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఇబ్రహీం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లిఫ్ట్ గుంతలో పడ్డ వ్యక్తికి తీవ్ర గాయాలు

అమీర్‌పేట, అక్టోబరు 8 ఆంధ్రజ్యోతి): భవన నిర్వాహకుల నిర్లక్ష్యంతో ఓ వ్యక్తి లిఫ్ట్ గుంతలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని వారాసిగూడ, మధురానగర్‌కు చెందిన రాములు(59) కుమారుడు సాయినంద నవీన్‌ను బ్యాంక్ పరీక్షల కోసం కోచింగ్ సెంటర్‌లో చేర్పించేందుకు సోమవారం మధ్యాహ్నం అమీర్‌పేటలోని శ్రీస్వాతి అంకూర్ భవనానికి వెళ్లారు. లిఫ్ట్ మొదటి అంతస్తులోకి రాకుండానే డోర్లు తెరుచుకున్నాయి. రాములు లోనికి కాలు పెట్టగానే ఒక్కసారిగా సెల్లార్‌లోని గుంతలో పడిపోయాడు. ఈ సంఘటనతో అప్రమత్తమైన కుమారుడు, ఇతర విద్యార్థులు రాములును హుటాహుటిన ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు కావడంతో పాటు ఎముకలు విరిగాయి. అప్రమత్తమైన భవనం వారు లిఫ్ట్ మరమ్మతులో ఉందని బోర్డును ఏర్పాటు చేయడం గమనార్హం. పాడైన లిఫ్ట్ గురించి ఎటువంటి హెచ్చరిక లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన భవన యజమానులపై బాధితుడి కుమారుడు సాయినంద నవీన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ వైద్యుడు అరెస్ట్

బంజారాహిల్స్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నకిలీ వైద్యుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహ్మత్‌నగర్‌కు చెందిన నీలి శశిధర్(32) వెంకటగిరిలో 'వెంకటేశ్వర ఫస్ట్ ఎయిడ్ క్లినిక్' పేరిట రిజిస్టర్డ్ మెడికల్ సర్టిఫికేట్ లేకుండానే వైద్యం చేస్తున్నాడని పోలీసులకు సమాచారం అందింది. జూబ్లీహిల్స్ ఎస్ఐ వినోద్‌కుమార్ సిబ్బందితో కలిసి క్లినిక్‌పై దాడి చేశారు. ఆ సమయంలో శశిధర్ రోగులను పరీక్షిస్తూ చికిత్స అందిస్తున్నాడు. విచారణలో అతడు రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ అయినప్పటికీ పూర్తి వైద్య సర్టిఫికేట్ లేకుండానే అన్ని రకాల చికిత్సలు అందిస్తూ రోగులను మోసం చేస్తున్నట్టు తేలింది. క్లినిక్‌లోని వైద్య పరికరాలను పోలీసులు సీజ్ చేశారు. ఈ క్లినిక్ నడపడంలో శ్రీనివాస్ అనే వ్యక్తి ప్రమేయం కూడ ఉన్నట్లు తేలింది. అతడు పరారీలో ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని శశిధర్‌ని అరెస్టు చేశారు.

మహిళను నిర్బంధించి నగలు, నగదు దోపిడీ

బంజారాహిల్స్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో కుటుంబ కలహం తీవ్ర రూపం దాల్చింది. సొంత అన్న అతడి కుమారులు ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించి మహిళను నిర్బంధించి, ఆమె విలువైన వస్తువులు దోచుకెళ్లారు. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్.55లో నివసిస్తున్న భజరంగ్‌లాల్ అగర్వాల్ భార్యతో కలిసి ఉంటున్నాడు. ఈనెల 7న అర్ధరాత్రి అతడి భార్య గదిలో ఉండగా, ఆమె సోదరుడు రూపేంద్ర అగర్వాల్, కుమారులు హుమిత్, రతిక్ అగర్వాల్ సహా నలుగురు గార్డులు, నలుగురుస్నేహితులతో కలిసి వచ్చారు. ఆమెను గదిలో నుంచి బయటకు లాగి, బలవంతంగా మొబైల్ ఫోన్ లాక్కొని, నిర్బంధించారు. ఇంట్లో ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఇంట్లో ఉన్న నగలు, లక్ష రూపాయల నగదు తీసుకొని పారిపోయారని బాధితురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు గాజులను ఇప్పించండి

యూసుఫ్‌గూడ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): చేతి గాజులు తీసి ఆపదలో ఆదుకుంటే, అవసరం తీరిన తర్వాత పట్టించుకోవడం లేదని మధురానగర్‌కు చెందిన నాగమణి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎం.సురేష్ కుమార్ మూసాపేటలోని బ్యాంక్ ఉద్యోగి. అదే బ్యాంక్‌లో పనిచేస్తున్న నవ్య, అనురాధ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. దీంతో సురేష్ భార్య నాగమణిని ఒప్పించి 23 గ్రాముల బంగారు గాజులను వారికి ఇప్పించాడు. వారు బంగారు గాజులను ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి, డబ్బులు తీసుకొని అవసరాలు తీర్చుకున్నారు. తిరిగి బంగారు గాజులను ఇవ్వమంటే పట్టించుకోవడం లేదని పోలీసులకు బుధవారం నాగమణి ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

కేక్ దుకాణంలో చోరీ

● రూ. 80 వేల నగదు, సెల్‌ఫోన్ అపహరణ

అమీర్‌పేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేటలోని కేక్ విక్రయ దుకాణం నుంచి నగదు, సెల్‌ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట శ్రీనివాస్ నగర్‌లోని ఫ్రాస్టింగ్ హట్ కేక్ ఫ్యాక్టరీ దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. యశ్వంత్‌కు చెందిన రూ. 80వేల నగదుతో పాటు సెల్‌ఫోన్‌ను చోరీ చేశాడు. బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఆర్‌నగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మర్యాద పూర్వక కలయిక

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ బుధవారం సాయంత్రం కంటోన్మెంట్‌కు వచ్చిన సందర్భంగా జాతీయ బీసీ ప్రజా చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు యనమల శ్రీనివాస్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. మంద కృష్ణ మాదిగను ఘనంగా సత్కరించారు.

- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి



పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతి స్వామితో విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్‌వీ సుబ్రమణ్యం

సుబ్రమణ్యస్వామి ఆలయంలో వేద సభలు

పద్మారావునగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం, దేవాదాయశాఖ వారి సౌజన్యంతో పద్మారావునగర్ స్కందగిరి శ్రీసుబ్రమణ్యస్వామి వారి ఆలయ ప్రాంగణంలో జనార్ధనానంద సరస్వతి స్వామి సంస్కృతి ట్రస్ట్ రజతోత్సవ కార్యక్రమంలో భాగంగా 25 వ తెలంగాణ వేద విద్వన్మహాసభలు బుధవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజ, క్షేత్రపూజ, గోపూజ వంటి కార్యక్రమాలను సుబ్రమణ్యం దంపతులు, వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం పుష్పగిరి పీఠాధిపతులైన శ్రీశ్రీ విద్యా శంకర భారతీ స్వామి వారి అనుగ్రహంతో సామవేద హవనం నిర్వహణ, వేద విశిష్టత, సమాజాభివృద్ధికి ఉపయోగపడే అంశాలను విశదపరచారు. సాయంత్రం వేదసభ, గురు వందనం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సభాధ్యక్షులు జే.వి.రావు, సంస్థ చైర్మన్ తూములూరి సాయినాథశర్మ, ప్రభుదత్త మహారాజు, డా.మద్దులపల్లి దత్తాత్రేయ శాస్త్రి, గట్టు నారాయణ, కుప్పా వెంకటకృష్ణమూర్తి, తూములూరి మదుసూధనరావు, మరుమాముల వెంకటరమణశర్మ(దర్శనం), చింతా నారాయణశర్మ, చావలిసాయి, పసర్లపాటి బంగారయ్యాశర్మలు వేద, ఆధ్యాత్మిక అంశాలపై ప్రసంగించారు. కీర్తిశేషులు కుప్పా సుబ్రమణ్యశాస్త్రి సంస్మరణ సభతో పాటుగా వారిచే రచింపబడిన శ్రీ భగవన్నామామృత రసోదయం గ్రంథం ఆవిష్కరణతో కార్యక్రమం ముగిసింది.



అనాథలు, యాచకులను ఆశ్రమానికి పంపిస్తున్న గోపాలపురం పోలీసులు

సికింద్రాబాద్‌లో స్పెషల్ డ్రైవ్ : సీఐ మధు కుమార్

అడ్డగుట్ట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : నగర పోలీస్ కమిషనర్ సజ్జానార్ ఆదేశాల మేరకు సికింద్రాబాద్‌లో స్పెషల్ డ్రైవ్ చేపట్టామని గోపాలపురం పోలీస్‌స్టేషన్ సీఐ మధుకుమార్ తెలిపారు. ఇక్కడ రాత్రి అయిందంటే చాలా మంది యాచకులు, అనాథలు దుకాణాలు, ఫుట్‌పాత్‌లపై, రైల్వేస్టేషన్ వద్దే తిష్ట వేస్తూ రాకపోకలు సాగించేవారిని ఇబ్బందులకు గురిస్తున్నారు. అలాగే రాత్రి పూట మందు బాబులు గంజాయి సేవించి ఈ ప్రాంతాల్లో హల్‌చల్ చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తెలియకుండానే నేరాలు జరిగే అవకాశం ఉంది. వీటిని నివారించేందుకు నగర పోలీస్ కమిషనర్ సజ్జానార్ ఆదేశాల మేరకు యాచకులు, అనాథలను చౌటుప్పల్‌లోని అమ్మనాన్న ఆశ్రమానికి తరలించామని సీఐ తెలిపారు. ఆశ్రమంలో బట్టలు, తిండి, ఉండేందుకు గదులు, ప్రత్యేక శిక్షణ యోగా ఉంటుంది. వీరిలో పరివర్తన మార్పు వస్తే సంతోషమే. ఇక నుంచి సికింద్రాబాద్‌లో ప్రతి రోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలియచేశారు



శిథిలావస్థలో పిల్లలు ఆడుకునే పరికరం



శిథిలావస్థలో జారుడు బల్ల

అధ్వానంగా చిలకలగూడ పార్కు!

- పేరుకుపోయిన చెత్తా చెదారం
- అసాంఘిక శక్తులకు అడ్డా
- అభివృద్ధి చేయాలని స్థానికుల విజ్ఞప్తి

చిలకలగూడ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ, పాత పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన పార్క్ అధ్వానంగా మారింది. మధ్య తరగతి వారు అధికంగా నివసించే ఈ ప్రాంతంలో ఉన్న ఈ పార్కును అభివృద్ధి చేసి కనీస సౌకర్యాలు కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పార్కులో ఏర్పాటు చేసిన జారుడు బల్ల, ఊయ్యాల వంటివి శిథిలావస్థకు చేరాయి. ఇక్కడ చెత్తా చెదారం పేరుకుపోయి అపరిశుభ్ర వాతారణం నెలకొంది. తోపుడు బండ్లకి వారికి అడ్డాగా మారి, సాయంత్రమైతే అసాంఘిక శక్తుల నిలయంగా మారింది. ఇక్కడ గతంలో పిల్లలు ఆడుకోవటానికి జారుడు బల్ల, పెద్ద వాళ్లు వ్యాయామం చేసుకోవటానికి అనువైన పరికరాలు ఏర్పాటు చేశారు. కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరంలో అందరికీ అనువుగా ఉన్న ఈ పార్కును అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.



పార్కు ముందు గేటు

అభివృద్ధి చేయాలి



పార్కులో కనీస సౌకర్యాలు లేవు. చెతాంత చెదారంతో నిండిపోయింది. చుట్టుపక్కల ఎక్కడా పార్కు దగ్గరలో లేదు. అందరికీ అనుకూలంగా ఉన్న ఈ పార్కును అభివృద్ధి చేస్తే ఉపయుక్తంగా ఉంటుంది. పిల్లల ఆడుకోవటానికి పరికరాలు అందుబాటులో ఉంచాలి. **- పావని, స్కై ఫౌండేషన్, ఉపాధ్యక్షురాలు**

నిర్లక్ష్య వైఖరి వీడాలి



కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరంలో పార్కుల పట్ల నిర్లక్ష్య వైఖరి మానాలి. చిలకలగూడ పార్కు ప్రైమ్ ఏరియాలో ఉండి చిన్న పిల్లలు ఆడుకోవడానికి, సీనియర్ సిటిజన్స్ ఇక్కడికి వచ్చి తేలికపాటి వ్యాయామాలు వంటివి చేసుకోవడానికి చాలా ఉపయోగకరంగా ఉంది. అభివృద్ధికి తక్షణమే చర్యలు తీసుకోవాలి. సంబంధిత అధికారులు ఈ దిశగా చర్యలు చేపట్టాలి. **- కృష్ణ చైతన్య, చిలకలగూడ వాసి**



వ్యాయామం చేసే పరికరం

ఆధునిక హంగులతో అల్వాల్ టిమ్స్ : ఎమ్మెల్యే శ్రీగణేశ్

తిరుమలగిరి అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆధునిక హంగులతో అల్వాల్ టిమ్స్‌ను అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ఆస్పత్రి నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. హెల్త్ డిపార్ట్‌మెంట్ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న ఆర్‌అండ్‌బీ డిపార్ట్‌మెంటు అధికారులతో కలిసి పనులు ఎలా జరుగుతున్నాయో క్షేత్రస్థాయిలో పర్యటించి తెలుసుకున్నారు. త్వరిత గతిన నిర్మాణం పూర్తికావడానికి ఏరకమైన సహాయ సహకారాలు అవసరమైనా అందిస్తానని తెలిపారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఇన్ని వసతులతో ఇంత మంచి ఆసుపత్రి ఏర్పాటు కావడం ఆనందంగా ఉందని 1000 పడకలు అందుబాటులోకి రానున్నాయని న్యూరాలజీ, ట్రామాకేర్, క్యాన్సర్, ఆర్థోపెడిక్ మొదలైన 19 విభాగాల వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలియచేశారు. మెడికల్ కాలేజీ కూడా 23 విభాగాలతో టీచింగ్ ఆస్పత్రి ఏర్పాటు కాబోతుందని, అతి తొందరలోనే నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభోత్సవం చేసి పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కదిరవన్, మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్, రామ్, బాలరాజు, హయత్ తదితరులు పాల్గొన్నారు.



టిమ్స్ ఆస్పత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

ఎమ్మెల్యేపై బీజేపీ నాయకుల ఆగ్రహం

సికింద్రాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పెట్టిన భిక్షతో కంటోన్మెంట్ శాసనసభ్యునిగా ఎన్నికైన శ్రీగణేశ్‌కు బీజేపీపై విమర్శలు చేసే నైతికహక్కు లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణుక మల్లిఖార్జున్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన ఓట్ చోరీ ఉద్యమానికి మద్దతుగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించడం పట్ల బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం అన్నానగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ పుణ్యాన ఆయనకు భారీగా ఓట్లు పోలయ్యాయని, దీనిని చూసే సీఎం గడిచిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఇచ్చారని తెలిపారు. ఎన్నికల్లో ఓటుకు రెండు వేల చొప్పున డబ్బులు పంచి ఎమ్మెల్యే విజయం సాధించినట్టు ప్రజలకు తెలుసన్నారు. బీజేపీ ఓట్ చోరీ చేసి ఉంటే గడిచిన లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు వచ్చి ఉండేవన్నారు. కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలి నియామకం, కంటోన్మెంట్ ఎన్నికలపై శ్రీగణేష్ తరచూ వ్యాఖ్యానాలు చేయడం మంచిది కాదన్నారు. జీహెచ్‌ఎంసీలో విలీనం చేసే ప్రక్రియ కారణంగా కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు జరగడం లేదని, అందుకే నామినేటెడ్ సభ్యురాలిని నియమించారని బాణుక మల్లిఖార్జున్ తెలిపారు. దివంగత శాసనసభ్యుడు జి.సాయన్న హయాంలో మంజూరైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్న ఘనత ఎమ్మెల్యేకు దక్కిందని వ్యాఖ్యానించారు. కిరణ్‌కుమార్, విజయానంద్, శ్రీకాంత్ జైనపల్లి, కిట్టు, టింకు, శంకర్, అరుణ్, శ్రీధర్ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న బాణుక మల్లిఖార్జున్ తదితరులు

దేవస్థాన పాలక మండలి సభ్యుడి నియామకం



శ్రీపతి సతీష్

రాంగోపాల్‌పేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యునిగా తెలంగాణ రాష్ట్రం నుంచి టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు, అఖిల భారత ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షులు శ్రీపతి సతీష్‌ను నియమించారు. ఈ సందర్భంగా శ్రీపతి సతీష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను లను అప్పగించిన టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌లకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

క్రైం సమాచారం

వేర్వేరు ప్రాంతాల్లో తల్లి కూతురు, యువతి, బాలిక అదృశ్యం



రాజేశ్వరి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో తల్లికూతురు కనిపించకుండాపోయారు. సికింద్రాబాద్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్‌కు చెందిన ప్రకాష్ చౌదరికి నాలుగేళ్ల క్రితం హైదరాబాద్ ఫలక్‌నుమాకు చెందిన రాజేశ్వరితో వివాహం జరిగింది. వీరికి 18 నెలల కూతురు ఉంది. నాలుగు నెలల క్రితం భార్య ఫలక్‌నుమాలో ఉంటున్న పుట్టింటికి వచ్చి ఇక్కడే ఉంటుంది. ఈ నెల 3న భర్త అత్తగారింటికి వచ్చాడు. ఈ నెల 6న భార్య, కూతురును తీసుకొని రాజస్థాన్‌కు వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వచ్చారు. రైల్వే స్టేషన్‌లో టిఫిన్ చేసి వస్తానని భార్య చెప్పగా కూతురితో బయటికి వెళ్లి తిరిగి రాలేదు. వెంటనే రైల్వే స్టేషన్‌లో గాలించినా ఫలితం లేకపోయింది. వెంటనే భర్త సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గోపాలపురం పీఎస్ పరిధిలో యువతి..



సోనాలి

అడ్డగుట్ట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద ఓ యువతి అదృశ్యమైన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం లాల్‌దర్వాజ ప్రాంతానికి చెందిన కజ్నాకర్ నంద కొడుకు, కూతురు సంతానం. కుమార్తె సోనాలి, తల్లి ఇద్దరూ కలిసి 7న మహారాష్ట్రకు వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్ ఫాం నంబరు 10 వైపునకు చేరుకున్నారు. అప్పటికే సోనాలిని కలిసేందుకు రైల్వేస్టేషన్ వద్ద కాపుకాసిన కరణ్‌సింగ్ అనే వ్యక్తికి స్టేషన్‌లో సోనాలి కనిపించడంతో ఆమెను వెంట బెట్టుకుని కనిపించకుండాపోయాడు. వెంటనే తల్లి ఈ విషయాన్ని గమనించి గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో కరణ్‌సింగ్ అనే వ్యక్తి తన కుమార్తెను తీసుకెళ్లిపోయాడని ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వారాసిగూడలో బాలిక..



మిషబా సుల్తానా

బౌద్ధనగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన ఓ బాలిక అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వారాసిగూడ మహ్మద్‌గూడ ప్రాంతానికి చెందిన మిషబా సుల్తానా(17) సెప్టెంబరు 29వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సుల్తానా కోసం పలుచోట్ల గాలించినా ఫలితం లేదు. దీంతో తండ్రి షేక్ మజీద్ తనకు మార్తె కనిపించటం లేదని మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

12 నుంచి పల్స్‌పోలియో

ముషీరాబాద్, అక్టోబర్ 8(ఆంధ్రజ్యోతి): పోలియోరహిత సమాజ స్థాప న కోసం ప్రభుత్వం ఈనెల 12న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని చేపట్టింది. మొదటిరోజు ప్రధాన కేంద్రాల్లో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి మొదలుకొని 5సంవత్సరాలలోపు పిల్లలందరికీ పోలియో చుక్కల మందు తప్పనిసరి వేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు (యూపీహెచ్‌సీ)లతోపాటు ఇంటింటికీ వెళ్లి చిన్నారులకు చుక్కల మందు వేసే కార్యక్రమం చేపట్టింది. ముషీరాబాద్ నియోజకవర్గంలోని యూపీహెచ్‌సీలలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బుధవారం ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో అంబర్‌పేట క్లస్టర్ డాక్టర్ పద్మజ స్థానిక వైద్యులతో పల్స్‌పోలియోపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముషీరాబాద్, భోలక్‌పూర్, తిలక్‌నగర్, ఏఎంఎస్, బాగ్‌అంబర్‌పేట, హర్రాస్‌పెంట వైద్యులచే సమావేశం నిర్వహించారు. తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు.

అయాన్ డిజిటల్ జోన్ వద్ద బీహెచ్‌ఈఎల్ ఆర్టిజన్ అభ్యర్థుల నిరసన

మల్కాజిగిరి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి మౌలాలిలోని అయాన్ డిజిటల్ జోన్ వద్ద బీహెచ్ఇఎల్ ఆర్టిజన్ అభ్యర్థులు బుధవారం సాయంత్రం ఆందోళనకు దిగారు. బుధవారం మౌలాలి అయాన్ డిజిటల్ జోన్‌లో బీహెచ్‌ఈఎల్‌కు చెందిన ఆర్టిజన్ అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 3.30 వరకు పరీక్ష సమయం కేటాయించారు. పరీక్ష సమయం అయిపోగానే అభ్యర్థులందరూ బయటకు వచ్చారని, అయితే కొంతమందిని పరీక్షా హాలులోనే ఉంచి మరో 15 నిముషాలు సమయం ఇచ్చారని ఆరోపిస్తూ నవీన్ అనే అభ్యర్థితో పాటు మరికొంతమంది అభ్యర్థులు అయాన్ డిజిటల్ జోన్ వద్ద ఆందోళనకు దిగారు. అయితే, ఈ విషయాన్ని పరీక్ష నిర్వాహకులు తోసిపుచ్చారు. ఎవరికి ఎలాంటి అదనపు సమయమూ ఇవ్వలేదని, దివ్యాంగ అభ్యర్థులకు నిబంధనల ప్రకారం అదనపు సమయం ఉంటుందని తెలిపారు. ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను నిబంధనల మేరకు అనుమతించలేదని వారు తెలిపారు.

పశువుల కొట్టాలకు ప్రభుత్వ స్థలం కేటాయించాలి



రాములు యాదవ్‌కు వినతిపత్రం ఇస్తున్న యాదవ సంఘం నాయకులు

మల్కాజిగిరి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): యాదవులు పశువుల కొట్టాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం స్థలం కేటాయించాలని నేరేడ్‌మెట్ యాదవ సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వంతో చర్చించాలని నేరేడ్‌మెట్ యాదవ సంఘం నేతలు సంఘం జాతీయ అధ్యక్షులు మేకల రాములుయాదవ్‌ను బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. నేరేడ్‌మెట్‌లో ఒకేచోట పశువులను కట్టేసేందుకు కొట్టాల ఏర్పాటు చేయడంతో పాటు పశువుల వ్యర్థాలతో గోబర్‌గ్యాస్ కేంద్రం ఏర్పాటు చేసుకునేందుకు స్థలం కేటాయించాలని వారు కోరారు. కార్యక్రమంలో నేరేడ్‌మెట్ యాదవసంఘం ప్రధాన కార్యదర్శి పూలపల్లి సుందర్‌యాదవ్, యాతం మంజులయాదవ్, పొన్నగంటి హరికృష్ణ నర్సింగ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చలేక ముఖం చాటేస్తున్న సీఎం

- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద

బోరబండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖం చాటేస్తున్నారని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్ తరఫున బోరబండ డివిజన్ బాబాసైలానీ నగర్‌లో పార్టీ కార్యకర్తలతో కలిసి బుధవారం రాత్రి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బస్తీలో ఇంటింటికీ తిరిగి 'కాంగ్రెస్ బాకీ కార్డు'లను పంపిణీ చేసిన ఆయన ఎన్నికల ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాగంటి గోపీనాథ్ చేసిన అభివృద్ధి గల్లీగల్లీలో కనిపిస్తోందని తెలిపారు. మాగంటి సతీమణి సునీత అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనేకమందికి మాగంటి డబుల్ బెడ్‌రూమ్ ఇప్పించడమే కాకుండా, బస్తీల్లో మౌలిక వసతులు కల్పించారని ప్రజలు చెబుతుంటే ఆనందంగా ఉందన్నారు. ఎన్నికల్లో తప్పుడు హామీలు ఇచ్చి దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక మంత్రులను ప్రజల వద్దకు పంపుతున్నారని ఆరోపించారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పేందుకు జూబ్లీహిల్స్ ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ బోరబండ డివిజన్ అధ్యక్షుడు టి.కృష్ణమోహన్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



బాబాసైలానీ నగర్‌లో ప్రచారం చేస్తున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద

నిరుపేదలకు వైద్య పరీక్షలు అభినందనీయం

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



ఎమ్మెల్యే తలసానికి పూల మొక్క అందజేస్తున్న మ్యాగ్నిస్ సంస్థ అధినేత శ్రీనివాసరావు

అమీర్‌పేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యతగా ఖరీదైన వైద్య పరీక్షలను నిరుపేదలకు ఉచితంగా అందుబాటులోకి తెస్తున్న మ్యాగ్నిస్ సేవలు అభినందనీయమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కొవిడ్ కష్టకాలం నుంచి ఇప్పటివరకు 1200కు పైగా ఉచిత వైద్య పరీక్ష శిబిరాలు నిర్వహించిన మ్యాగ్నిస్ అధినేత, రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ ఇన్‌చార్జి డాక్టర్ సంగం శ్రీనివాస్‌రావును ఆయన అభినందించారు. ఎస్‌ఆర్‌నగర్‌లోని మ్యాగ్నిస్ సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగిన ఉచిత శిబిరానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ ఆర్థికంగా వెనకబడ్డ వయోధికులకు ఉచితంగా వైద్య పరీక్షలు, అనాథలు, మురికివాడల్లో ప్రజలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఖరీదైన వైద్య పరీక్షలను అందుబాటులోకి తెస్తూ మాగ్నిస్ సంస్థ చేస్తున్న కృషిని ప్రశంసించారు.

దళితుల అభ్యున్నతికి కృషి చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మాల సంఘాల జేఏసీ నాయకులు

- మాల సంఘాల జేఏసీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, వివేక్ వెంకటస్వామి ఇద్దరూ కలిసి దళితుల అభ్యున్నతికి కృషి చేయాలని మాల సంఘాల జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వేదికగా మాల సంఘాల జేఏసీ, మాల స్టూడెంట్ జేఏసీ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలపై బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్, గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ బెర బాల కిషన్, మాల స్టూడెంట్ జేఏసీ చైర్మన్ మాదాసు రాహుల్ రావు మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ అంశం ముగిసిందని చేసిన వ్యాఖ్యలు అసంబద్ధమని అన్నారు. ఎస్సీ వర్గీకరణ కారణంగా ఐదు నెలలుగా రాష్ట్రంలోని 58 కులాలు ఎటువంటి అవకాశాలు పొందక నష్టపోతున్నాయని వాపోయారు. ఎస్సీ వర్గీకరణ వల్ల తెలంగాణలో మందకృష్ణ మాదిగ, రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి మాత్రమే లాభపడుతున్నారని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ గౌరవాధ్యక్షులు చెరుకు రామచందర్, మాస శేఖర్, అంసా ఓయూ అధ్యక్షుడు నామ సైదులు, అంజిబాబు, కొప్పుల అర్జున్, ఎలుకల నర్సింగ్, వోరేం సాగర్, మాదాసు సునీల్, మోహన్, రాంబాబు పాల్గొన్నారు.